

..చిత్తశుద్ధి లేదు

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్షిణ తెలంగాణపై చిత్తశుద్ధి లేదని ప్రొ.హరగోపాల్ అన్నారు.

వివరాలు 8లో ▸



నేటినుంచి ఉత్సవాలు

మద్దిమడుగు ఆంజనేయస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.2 /24.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

ఇఫ్తార్ 6-37
(మంగళవారం సాయంత్రం)

సహర్ 4-48
(బుధవారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రం వరకు ప్రయాణించొచ్చు: ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: పదోతరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బస్‌పాస్‌లో పేర్కొన్న దూరం (గమ్యస్థానంతో) సంబంధం లేకుండా వారి నివాసం నుంచి పరీక్షకేంద్రానికి ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు జారీ చేసిన రాయితీ పాస్, హాల్ టికెట్‌తో పరీక్ష వరకు కండక్టర్లు అనుమతించాలని కోరారు. ఒకవేళ పరీక్షకు హాజరయ్యే విద్యార్థి దగ్గర ఎలాంటి బస్‌పాస్ లేకపోతే సాధారణ చార్జీతో టికెట్ జారీ చేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, బస్‌పాస్‌తో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని ఈ నెల 13 వరకు అనుమతిస్తామని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో రాయితీ బస్‌పాస్, హాల్‌టికెట్‌తో కూడిన కాంబినేషన్ టికెట్‌తో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా విద్యార్థులు ప్రయాణించడానికి అనుమతించాలని కండక్టర్లకు సూచించారు.

మహనీయులను స్మరించుకుందాం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహనీయులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ సీతారామరావు సూచించారు. ఈ నెల 5న జగ్జీవన్‌రామ్ జయంతి, 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులతో చర్చించారు. గతేడాది కన్నా ఈ సారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా సహకరించాలనికోరారు. ప్రభుత్వం తరపున అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. పలువురు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. జయంతి ఉత్సవాల నిర్వహణతోపాటు, ఎస్సీ, ఎస్టీలపై చేస్తున్న దాడులు, అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,615

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో సోమవారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,615, కనిష్ఠంగా రూ.5,099 ధరలు లభించాయి. గరిష్ఠంగా మొక్కజొన్న రూ.2,129, పెబ్బర్లు రూ.5,506, జొన్నలు రూ.5,001, కందులు రూ.7,799, రాగులు రూ.3,111, మినుములు రూ.7,460, ఆముదాలు రూ.6,149 ధర లభించాయి.

1,267 మందికి సీపీఆర్ శిక్షణ

పాలమూరు: గుండెపోటుపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంచే క్రమంలో రాష్ట్రప్రభుత్వం జిల్లాలో ఐదుగురు మెడికల్ ఆఫీసర్లకు సీపీఆర్)పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి శిక్షణ తీసుకున్న వారు మూడు రోజుల నుంచి జిల్లాలో ఉన్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి సీపీఆర్‌పై ఇస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సబ్ సెంటర్లు, పల్లె దవాఖానాలలో పనిచేస్తున్న వైద్యులు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్ ఇతర సిబ్బందిని కలిపి మొత్తం 1,338 మందిని సీపీఆర్ శిక్షణ కోసం గుర్తించారు. ఇందులో 1,267 మందికి సీపీఆర్‌పై శిక్షణ పూర్తి చేశారు. ఐదుగురు మెడికల్ ఆఫీసర్లు ఒక్కొక్కరు ప్రతి రోజు రెండు పీహెచ్‌సీలలో 20 మంది సిబ్బందిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి సీపీఆర్ ఎలా చేయాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. మిగిలిన 71మందికి త్వరలో శిక్షణ ఇస్తామని నోడల్ అధికారి డాక్టర్ శశికాంత్ వెల్లడించారు. ఈనెల 5 నుంచి మున్సిపాలిటీలలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందితో పాటు జిల్లా అగ్నిమాపక శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.





ఈ ఫొటోలో కనిపిస్తున్నది నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం చుక్కాయిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం. పాత గ్రామ పంచాయతీ భవనంలోని ఇరుకైన గదిలోనే చిన్నారులకు బోధన కొనసాగిస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం ఫ్యాన్లు సైతం లేక చిన్నారులు ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు మరుగుదొడ్డి సౌకర్యం లేక ఆరుబయటకు వెళ్తూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



'ఇది నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రం ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి. ఇక్కడి కేంద్రంలో కరెంటు సరఫరా, ఫ్యాన్లు లేక చిన్నారులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. చిన్న గదిలో వెలుతురు సైతం సరిగా ఉండటం లేదు. చిన్న గదిలోనే వంట చేయాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.



'ఈ ఫొటోలో కనిపిస్తున్నది నారాయణపేట జిల్లా మరికల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం. ఇక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోనే అంగన్‌వాడీ కేంద్రం కోసం కొత్త భవనం నిర్మించారు. అయితే ఇప్పటికీ టాయిలెట్ సౌకర్యం లేక శిథిలావస్థలో ఉన్న పాత భవనంలోనే కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు లేకపోవడంతో ఎండ వేడిమికి ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్న చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ భారతమ్మ ఇలా విసనకర్రతో గాలి వచ్చేలా ఊపాల్సి వస్తోంది.

'ఇది జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని అమరవాయి అంగన్‌వాడీ కేంద్రం. గ్రామంలోని మూడు సెంటర్లకు సంబంధించి మొత్తం 75 మంది చిన్నారులు ఉండగా అన్నింటికి కలిపి ఒక్కరే ఆయా ఉంది. దీంతో అందరినీ ఒకే భవనంలో ఉంచి బోధన కొనసాగిస్తున్నారు. అయితే కేంద్రంలో ఫ్యాన్లు లేకపోవడంతో ఒకే గదిలో 75 మంది చిన్నారులు ఎండవేడిమికి అల్లాడుతున్నారు.



వేడికి విలవిల!

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కరువు

- గదుల్లో ఫ్యాన్లు, వెలుతురుకు నోచుకోని వైనం
- చాలా సెంటర్లకు కరెంట్ సరఫరా లేక తీవ్ర అవస్థలు
- వేసవిలో వర్ణనాతీతంగా ఇబ్బందులు
- విద్యుత్ కనెక్షన్ భారం పంచాయతీలకే



మహబూబ్‌నగర్ మండలంలో పెంకుటిల్లులో కొనసాగుతున్న ఓ అంగన్‌వాడీ కేంద్రం

సాక్షి ఫోకస్

సాక్షి, నాగర్‌కర్నూల్: వేసవినేపథ్యంలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సగటున 40 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిత్యం ఉదయం 10 గంటలకే భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని పాఠశాలలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. అలాగే వారం రోజుల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగిస్తున్నారు. ఆరేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్యాబోధన చేపడుతుండగా కేంద్రాల్లో కరెంటు, ఫ్యాన్ల సౌకర్యం లేక చిన్నారులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు.

పంచాయతీలకు భారం..

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు సంబంధిత స్త్రీ, శిశు సంక్షేమశాఖ నుంచి నిధులు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆయా గ్రామ పంచాయతీలే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. అయితే ఏయే అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు లేవన్న కనీస సమాచారం కూడా సంబంధిత శాఖ అధికారుల వద్ద లేదు. దీన్ని బట్టే అంగన్‌వాడీ కేంద్రాల సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. చాలావరకు గ్రామ పంచాయతీలు సైతం ఈ విషయంపై దృష్టిపెట్టకపోవడంతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలు కరెంట్ సరఫరాకు నోచుకోవడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో4,322 కేంద్రాలు ఉంటే 2,456 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం ఉండగా... 1,866 కేంద్రాలకు లేదు.

ఒకే గదిలోనే..

ఉమ్మడి జిల్లాలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు కనీసం కరెంటు సౌకర్యం లేదు. కేంద్రాల్లో ఫ్యాన్లు అందుబాటులో లేక పెరుగుతున్న ఎండలకు చిన్నారులు అల్లాడుతున్నారు. అద్దె భవనాలు, ఇరుకైన గదులు, వెలుతురు లేని చీకటి గదులతో చిన్నారులు సతమతమవుతున్నారు. ఆరేళ్లలోపు చిన్నారులు కరెంటు, ఫ్యాన్లు, లైట్లు లేని గదుల్లో అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఒకే గదిలో నిర్వహిస్తూ చిన్నారులను కూర్చోబెట్టడంతో పాటు అదే గదిలో వంట చేస్తుండటంతో వేడి మరింత పెరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	విద్యుత్ సౌకర్యం ఉన్నవి
మహబూబ్‌నగర్	1,185	643
నాగర్‌కర్నూల్	1,131	525
జోగుళాంబ గద్వాల	713	431
నారాయణపేట	704	326
వనపర్తి	589	529

ఉక్కపోతతో ఇబ్బంది..



ఎండాకాలం ఉదయం 10 గంటలకే ఎండ వేడి పెరుగుతోంది. మా అంగన్‌వాడీ భవనం సరిగ్గాలేదు. కరెంటు, ఫ్యాన్లు, లైట్లు లేక చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రంలో కనీసం కరెంటు కనెక్షన్ ఇస్తే ఇబ్బంది తీరుతుంది.

– పద్మ, అంగన్‌వాడీ టీచర్, ఉప్పునుంతల

ఇప్పటికైనా స్పందించాలి..



కేటీదొడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం కరెంటు సౌకర్యం కూడా లేదు. ఉదయం 10 గంటలకే ఉష్ణోగ్రత పెరుగుతోంది. ఫ్యాను లేక ఎండ వేడిమికి చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో కరెంట్ సౌకర్యం కల్పించాలి.

– కొండయ్య, కేటీదొడ్డి

చర్యలు తీసుకుంటాం..

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్ కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి ప్రొవిజన్ లేదు. అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న సంబంధిత గ్రామ పంచాయతీలే విద్యుత్ సౌకర్యం కల్పించాలి. సమస్య ఉన్న కేంద్రాలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– వెంకటలక్ష్మి, జిల్లా సంక్షేమశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

సమాచారం తెలియదు..



జిల్లాలో విద్యుత్ సౌకర్యం లేని అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం నాకు తెలియదు. ఈ విషయమై ఎప్పుడూ సమాచారం తెలుసుకోలేదు.

– వేణుగోపాల్, జిల్లా సంక్షేమశాఖ అధికారి, నారాయణపేట



ఈసారైనా పరిష్కారం లభించేనా?

- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- ముఖ్యంగా తాగునీటిపై చర్చించే అవకాశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజా సమస్యలకు ఈసారైనా పరిష్కారం లభిస్తుందో లేదో అని జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఫిబ్రవరి 25న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఈ క్రమంలోనే మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అధ్యతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. కాగా.. జెడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు జెడ్పీటీసీలు సిద్ధమయ్యారు. దీంతో పాటు పెండింగ్ పనుల వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాలకు తమను భాగస్వామ్యం చేయడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో తాగునీటిపై చర్చ..

వేసవి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అక్కడక్కడ అంతరాయం ఏర్పడుతుంది. జిల్లాకేంద్రంతో పాటు తరుచూ పైపులైన్ లీకేజీల సమస్య వస్తుంది. గ్రామాల్లో ఈజీఎస్ కింద సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రోడ్లు వేసే క్రమంలో పైపులైన్లు దెబ్బతినడంపై సభ్యులు సభ దృష్టికి తెచ్చే అవకాశం ఉంది.

42 అంశాలతో ఎజెండా

ఈ సర్వసభ్య సమావేశంలో 42 అంశాలపై ఎజెండాను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో 37శాఖ ప్రగతి నివేదికలను అధికారులు జెడ్పీకి సమర్పించారు. కాగా జిల్లా మార్కెటింగ్, ఈఈఐబీ డివిజన్ మహబూబ్‌నగర్, ఎంజీజీఎల్ఐపీ సర్కిల్, సీపీఓ, టీఎస్‌ఈడబ్ల్యు ఐడీసీ మహబూబ్‌నగర్ సర్కిల్‌లకు చెందిన ఎజెండాలు జెడ్పీకి సమర్పించలేదు.

అభివృద్ధికి ప్రాధాన్యం



జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాం. ముఖ్యంగా వ్యవసాయం, మిషన్ భగీరథ, డీఆర్‌డీఓ, ఆరోగ్యశాఖలపై చర్చిస్తాం. సభ్యులందరికీ తమ సమస్యలు సభ దృష్టికి తెచ్చేందుకు అవకాశం కల్పిస్తాం. స్థానిక ఉన్న సమస్యలను సభ దృష్టికి తెస్తే పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాం.

– స్వర్ణసుధాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్, మహబూబ్‌నగర్



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష రాయడానికి కేంద్రంలో సిద్ధంగా ఉన్న విద్యార్థులు



పరీక్ష సమయం కావడంతో పరుగెత్తుకుంటూ వస్తున్న విద్యార్థి

తొలిరోజు ప్రశాంతం

- 12,555 మంది విద్యార్థులు హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదోతరగతి మొదటి పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కేంద్రాలకు చేరుకున్నారు. ఆలస్యంగా వచ్చిన ఒకరిద్దరు విద్యార్థులను అనుమతించారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకే పూర్తి కావాల్సి ఉండగా.. ప్రభుత్వం తెలుగు పరీక్షకు అదనంగా 20 నిమిషాలు కేటాయించడంతో 12.50 గంటల వరకు సమయం ఇచ్చారు. కాగా.. చాలా కేంద్రాల్లో సరైన వసతులు కల్పించలేదనే విమర్శలు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 60 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. రెగ్యులర్, ప్రైవేట్ కలిపి 12,626 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 12,555 మంది పరీక్ష రాశారు. 71 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో ఒక ప్రైవేట్ పరీక్ష కేంద్రం ఉండగా.. 67 మందికి 57 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లాకేంద్రంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో డీఈఓ యాదయ్య తనిఖీలు చేశారు. డీఎల్‌ఓ 5, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 25 కేంద్రాలను తనిఖీ చేశారు.

‘హరితహారం’ కార్యాచరణ సిద్ధం చేయండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా వచ్చే సీజన్‌లో నాటనున్న మొక్కలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వైకుంఠధామాలలో విద్యుత్, నీటి కనెక్షన్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. టెన్త్ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఇన్విజిలేటర్లతో సహా అందరికీ పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఈ-ఆఫీసులో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఆయా కార్యాలయాల వారి నివేదిక తయారు చేసి క్లోజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు పనిచేసే ప్రాంతంలో, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద తాగునీటితో పాటు ఓఆర్‌ఎస్ పాకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ఫిర్యాదులు పరిష్కరించాలి:

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజావాణి ఫిర్యాదులు జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవినాయక్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోనీ మీటింగ్‌హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు సమర్పించే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడమే కాకుండా వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి సాధ్యం కాని ఫిర్యాదులను పై అధికారులకు నివేదించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును జిల్లాకేంద్రానికి తీసుకురావాల్సిన పనిలేదని, మండలస్థాయిలో పరిష్కారమయ్యే ఫిర్యాదులను అక్కడే ఇవ్వాలన్నారు. తాజాగా భూముల సర్వేకి సంబంధించిన దరఖాస్తులతో పాటు, మున్సిపాలిటీ రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధిచి ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీఆర్డీఓ యాదయ్య, ఆర్‌డీఓ అనిల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవినాయక్

ఉద్యమానికి ఊపిరి పోసిన మహనీయుడు

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల సాయుధ పోరాటంలో తూటాలకు బలైన మొదటి వ్యక్తి దొడ్డి కొమురయ్య అని అన్నారు. చాకలి ఐలమ్మ పోరాటంలో ముందున్న వ్యక్తి అని, ఆరోజు ప్రారంభమైన ఉద్యమానికి ఊపిరిపోసిన మహనీయుడని తెలిపారు. ఆనాటి దొరల గడిలను బద్దలు కొట్టి, తెలంగాణకు నాంది పలికాడని కొనియాడారు. ఎంతో మంది మహనీయులు పోరాటాలను చేసి తెలంగాణకు కృషి చేస్తే వారికి ఎలాంటి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. ప్రత్యేక రాష్ట్రమైన తర్వాత మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించే ఏర్పాట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర రాజధానిలో అన్ని కులాల ఆత్మగౌరవ భవనాలను ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అని తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి జిల్లాలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, విఠల్‌రావుఆర్యా, శాంతన్న యాదవ్, వెంకట నరసయ్యయాదవ్, చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

జనోత్సవం



అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున వైభవోపేతంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయం జనసంద్రంగా మారింది. మూడు గంటల పాటు ఈ ఘట్టం కోలాహలంగా సాగింది. – చారకొండ

- వివరాలు 10లో..

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

ఊట్కూరు: ట్రాక్టర్ బోల్తాపడి నిడుగుర్తి చెందిన డ్రైవర్ నర్సింహులు(35) మృతి చెందిన సంఘటన లక్ష్మీపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన బాల్‌రెడ్డి ట్రాక్టర్‌లో ఉల్లిగడ్డలను అమ్మడానికి నిడుగుర్తికి చెందిన డ్రైవర్ నర్సింహులు రాయచూరుకు వెళ్లి తిరిగి బయలుదేరాడు. గ్రామ సమీపంలో రాగానే ట్రాక్టర్ వీలు ఊడిపోయి అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో నర్సింహులు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- తిరుమలలో గుండెపోటుతో వ్యక్తి మృతి


వెంకట్‌రెడ్డి (ఫైల్)

దామరగిద్ద: తిరుపతి వెంకన్నను దర్శించుకునేందుకు వెళ్లిన మండలానికి చెందిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నర్సాపూర్ చెందిన వెంకట్‌రెడ్డి (53) శుక్రవారం గ్రామస్తులతో కలిసి తిరుపతికి వెళ్లారు. శనివారం సాయంత్రం కొండకు చేరుకొని స్వామి వారికి తలనీలాలు సమర్పించాడు. దైవ దర్శనానికి క్యూలైన్‌లో నిలిచాడు. హఠాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో వెంట ఉన్న వారు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సోమవారం గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

ఇంకుడుగుంతలో పడి వ్యక్తి..

గోపాల్‌పేట: ఇంకుడు గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన కటికె యూసుఫ్(57) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే అందరూ పడుకున్నారు. ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి ఇంకుడుగుంతలో ఏదో పడినట్లు గుర్తించారు. బయటికి తీసి చూడగా యూసుఫ్‌గా గుర్తించారు. ఈ విషయంపై ఎస్ఐ మల్లేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆడపిల్ల పుట్టలేదని తల్లి ఆత్మహత్య

మల్దకల్: ఆడపిల్ల పుట్టలేదని మనస్తాపానికి గురైన ఓ తల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అడివి రావల్‌చెర్వుకు చెందిన బలిజ రాజు, జయశ్రీ (31) దంపతులు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇప్పటికే ఇద్దరు మగపిల్లలు సంతానం ఉన్నారు. మూడవ కాన్పులో కూడా మగపిల్లవాడు జన్మించడంతో తల్లి జయశ్రీ మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యరాత్రి అందరూ నిద్రిస్తుండగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన కర్నూలు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రైలు కిందపడి యువకుడు..

మానవపాడు: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కాగా మొదట గుర్తు తెలియని వ్యక్తిగా రైల్వేపోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం మృతుడి వివరాలను సేకరించారు. రైల్వేహెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జల్లాపురం చెందిన మద్దిలేటి (33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా కొద్ది రోజులుగా ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇంటి నుంచి ఈ నెల 1వ తేదీన ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కాగా శనివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య సరోజ, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

నవాబుపేట: ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని మల్కాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి నర్సమ్మ సోమవారం తన కూతురుకు చెందిన బంగారంతో పాటు తన బంగారు ఆభరణాలు ఇంట్లోని బీరువాలో పెట్టి కూలీకి వెళ్లింది. తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళంతో పాటు బీరువా తాళం పగలగొట్టి బీరువాలో ఉంచిన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

దక్షిణ తెలంగాణపై చిత్తశుద్ధి లేదు

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పేపర్ లీక్
- 'పాలమూరు-రంగారెడ్డి'ని పక్కన పెట్టి కాళేశ్వరంపై దృష్టి పెట్టారు
- ప్రొఫెసర్ హరగోపాల్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్, పక్కన రాఘవచారి తదితరులు

పాలమూరు: డబ్బు, రాజకీయ అండ ఉన్న వారికి పేపర్ అందిందని, కష్టపడి పరీక్ష రాసిన పేదలు అన్యాయని గురయ్యారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందని దాదాపు 30లక్షల మంది ఉన్నత చదువులు చదివిన వారు ఖాళీగా ఉన్నారని, ప్రతి ఏడాది ప్రభుత్వం పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఈ సమస్య పరిష్కారం చాలంటే శాశ్వత ఉద్యోగ చట్టం అమల్లోకి తీసుకురావాలన్నారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటయ్యిందే నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధాన అంశాలపై కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత ఈ 9ఏళ్ల కాలంలో యూనివర్సిటీలను, విద్య రంగాన్ని నాశనం చేస్తున్నారన్నారు. కేవలం 10నుంచి 15మందితో పని చేసే పాలమూరు యూనివర్సిటీని ఎవరైనా యూనివర్సిటీ అంటారా? దీనికి కేవలం రూ.8కోట్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఆర్డర్ వస్తే ఆ పనులు పక్కన పెట్టి ఈ ప్రభుత్వం కాళేశ్వరం వైపు ఎందుకు వెళ్లారని, ఆ ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యత దీనికి ఎందుకు ఇవ్వలేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఉత్తర తెలంగాణపై ఉన్న చిత్తశుద్ధి దక్షిణ తెలంగాణపై ఏమాత్రం లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి దగ్గర ఉన్న యంత్రాలు, ఇతర సామగ్రిని కాళేశ్వరం తరలిస్తుంటే ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్యేలు సీఎంను ఎందుకు ప్రశ్నించలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఇప్పటికే పూర్తి చేసి ఉంటే లీగల్ సమస్యలు వచ్చేవి కాదన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు చేస్తున్న సేవ, సాధారణ ప్రజలకు ఏమాత్రం చేయడం లేదన్నారు. పాలమూరు అధ్యాయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ.. అధ్యాయన వేదిక ఏర్పాటై 17ఏళ్లు పూర్తయిన క్రమంలో ఈనెల 2న కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి, పలు అంశాలపై తీర్మానం చేసినట్లు తెలిపారు. 25న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మానవ సంబంధాలపై టెక్నాలజీ ప్రభావం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మానవ సంబంధాలపై టెక్నాలజీ బలమైన ప్రభావం చూపుతోందని హెచ్‌సీయూ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. శాస్త్రీయంగా ఎదుగుతూ మానవ సంబంధాలను ఉన్నతీకరించుకోవాలని సూచించారు. సామాజిక శాస్త్రాల్లో మరిన్ని పరిశోధనలు చేపట్టాలన్నారు. మరో సెమినార్‌లో రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.వనమాల మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధస్సు మరింత పెరగాలన్నారు. ముఖ్యంగా నిజాయితీ, నిబద్ధత కలిగి నిరాడంబరంగా ఉండాలన్నారు. ఆడపిల్లలు సైతం ఉన్నత విద్యనభ్యసించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.టి.విజయలక్ష్మి, అధ్యాపకులు వి.పుష్పలత, సుధాకర్‌రెడ్డి, మద్దిలేటి, మధుసూదన్, వాసంతి, నిశ్చల పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి దీక్ష


ప్రియుడి ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న యువతి, ప్రజా సంఘాల నాయకులు

బిజినేపల్లి: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ప్రియురాలు ఇంటి ఎదుట దీక్షకు కూర్చింది. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలుకు చెందిన యువతి 2018 నుంచి మండలంలోని పాలెంకు చెందిన బురానుద్దీన్‌తో ప్రేమలో ఉన్నారు. 2020లో ఇరు కుటుంబాలు వివాహం కోసం నిశ్చితార్థం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో తన చెల్లి పెళ్లి తర్వాత తన పెళ్లి చేసుకుందామని వాయిదా వేసిన బురాన్ నేటి వరకు ఆ యువతిని వివాహం చేసుకోకుండా మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రేమించిన యువతి ఆదివారం సాయంత్రం నుంచి ఇంటి వద్దనే కూర్చొని నిరసన తెలిపింది. సోమవారం ఐద్వా జిల్లా కార్యదర్శి గీత, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ, ఆవాజ్ సంఘం నాయకులు సలీం, బాబా, ప్రజా సంఘాల నాయకులు సోమనాథ్, కిరణ్, రామకృష్ణ, రాంచందర్, సునీత యువతికి మద్దతు తెలిపారు. పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన బురాన్ ఆ యువతి నుంచి ఆర్థికంగా, శారీరకంగా వాడుకొని ఇప్పుడు మరో యువతితో పెళ్లికి సిద్ధమైన అతనిపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. తనకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆ యువతి తన బ్యాగులో నుంచి విషం సీసా బయటికి తీసింది. వెంటనే అక్కడ ఉన్న నాయకులు ఆ సీసాను తీసుకుని పారవేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆమరణదీక్ష చేస్తామని అన్నారు. ఎస్ఐ ఓబుల్‌రెడ్డి బాధితురాలికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు.

సలేశ్వరం జాతరకు టోల్ రుసుం

మన్ననూర్: నల్లమల అభయారణ్యంలో వెలసిన సలేశ్వరం లింగమయ్య స్వామి ఉత్సవాలకు వెళ్లే భక్తుల వాహనాల అనుమతులకు అటవీశాఖ టోల్ రుసుము నిర్ణయించింది. ఈ నెల 5, 6, 7 తేదీలలో ఉత్సవాల నేపథ్యంలో అటవీమార్గం గుండా వెళ్లే వాహనాలకు టోల్ వసూలు చేయనున్నారు. బైక్‌కు రూ.100, మూడు చక్రాల వాహనం (ఆటో) రూ.300, నాలుగు చక్రాల వాహనాలకు రూ. 500, ట్రాక్టర్, డీసీఎం, లారీ, టూరిస్టు బస్సుకు రూ. వెయ్యి కాగా ఆర్టీసీ బస్సులకు మినహాయింపు ఇచ్చారు. మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు, ఫరహాబాద్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన టోల్ గేటు కౌంటర్ల వద్ద భక్తులు రుసుము చెల్లించి రశీదు తీసుకోవాలి. భక్తులు ప్రయాణ సమయంలో అటవీశాఖ నియమ నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గద్వాల క్రైం: బాలికను కిడ్నాప్ చేసిన సంఘటనలో యువకుడిని రిమాండ్ తరలించినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ సోమవారం తెలిపారు. మండలంలోని కొండపల్లికి చెందిన విద్యార్థినిని గత నెల31వ తేదీన గద్వాల పట్టణంలో పరీక్ష రాసేందుకు వచ్చింది. ఈ క్రమంలో మధ్యాహ్నం వేళ హరికృష్ణ కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి, సోమవారం సాయంత్రం యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మేకలను ఎత్తుకెళ్లే ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ పోలీసులు

వనపర్తి క్రైం: మేకలను ఎత్తుకెళ్లే ముఠాను సోమవారం సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో సీసీఎస్ సీఐ శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన సోదరులు స్వామి, సాయి జల్సాలకు అలవాటుపడి మేకల దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. దాని కోసం వనపర్తికి చెందిన ముత్తు, శ్రీకాంత్, విష్ణులతో కలిసి ముఠాగా ఏర్పరుచుకున్నారు. వీరు బైక్‌లపై చుట్టు పక్కల గ్రామాలు తిరిగి మేకలను దొంగిలించేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. పాన్‌గల్ మండలం అన్నారం చెందిన రాముడు 3 మేకలను తన ఇంటిపక్కనే కట్టేసి పడుకున్నాడు. గత నెల 30న రాత్రి ఐదుగురు నిందితులు 3 మేకలను దొంగిలించి, వాటిని సింగోటం గ్రామంలో బంధువుల ఇంట్లో ఉంచారు. వాటి విలువ రూ.39వేలు ఉంటుందని పేర్కొన్నారు. మరుసటి రోజు రాముడు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో వనపర్తి సీసీఎస్ పోలీసులు కేసు ఛేదనకై ముమ్మరంగా ప్రయత్నాలు చేపట్టారు. సోమవారం ఉదయం పాన్‌గల్ మండలం దావాసిపల్లి స్టేజీ వద్ద పోలీసుల వాహనాల తనిఖీ చేస్తుండగా.. ఐదుగురు నిందితుల్లో ముగ్గురు పట్టుబడగా, సాయి, స్వామి పరారయ్యారు. వారి వద్ద నుంచి 3 మేకలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పదేళ్లుగా పరారీ.. అరెస్టు చేసిన సీఐడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఓ రియల్‌ఎస్టేట్ కంపెనీని స్థాపించి దాని ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురిని మోసగించి పరారీలో ఉన్న నేరస్థుడిని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా మనవపాడు మండలం జల్లాపూర్‌కి చెందిన కిరణ్‌ను అరెస్టు చేసి వనపర్తి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎదుట హాజరు పర్చినట్లు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు 2013 నుంచి పరారీలో ఉన్నట్లు చెప్పారు. కిరణ్ మరికొందరితో కలిసి అక్షర గోల్డ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కంపెనీ స్థాపించాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో పలువురికి రియల్ ఫుడ్ బజార్ల పేరుతో స్థలాలు విక్రయిస్తామంటూ రూ.50 లక్షల వరకు వసూలు చేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

బిచ్చం వేసైనా ఆదుకోండి!


బిచ్చం వేయాలని వేడుకుంటున్న నిర్వాసితులు

- కర్వెన రిజర్వాయర్ బాధితుల వేడుకోలు

పంజగుట్ట: 'మా పొలాలు లాక్కున్నారు.. ఇళ్లు తీసుకున్నారు.. సరైన నష్టపరిహారం లేదు.. ఇస్తామన్న హామీలు నెరవేర్చలేదు.. కనీసం బిచ్చం వేసి మమ్మల్ని ఆదుకోండంటూ' పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని కర్వెన రిజర్వాయర్ బాధితులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూనిర్వాసితులు బాలకృష్ణ, ఇస్లావత్ నర్సింహ, హనుమమ్మ మాట్లాడారు. 2015 మే 12వ తేదీన ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. అప్పుడు ముఖ్యమంత్రి మాట్లాడుతూ భూమి ప్రస్తుతం ఉన్న రేటుకు నాలుగింతలు ఎక్కువ కట్టిస్తామని, ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని, ఉద్యోగంలో చేరి నెల జీతం తీసుకున్న తర్వాతే మీ భూములు మాకు ఇవ్వాలని చెప్పారన్నారు. భూమికి బదులుగా మరోచోట భూమి ఇస్తామని ఎన్నో హామీలు ఇచ్చారని, ఒక్కటి కూడా నెరవేర్చకున్నా తల నరుక్కుంటానని అన్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి అన్న మాటలకు కనీసం ఎకరానికి రూ.12 లక్షలు, ఒక ఉద్యోగం, భూమికి బదులు భూమి వస్తుందనుకున్నామని కానీ ఎకరానికి రూ.3.5లక్షల నుంచి రూ.5.5లక్షల వరకు ఇచ్చి తీసుకోకుంటే ఇదికూడా దక్కదని బలవంతంగా పంపించేశారన్నారు. తాము కనీసం 2013 భూని ర్వాసిత చట్టం ప్రకారం న్యాయం చేయాలని ఎన్నోమార్లు వేడుకున్నా పట్టించుకోలేదన్నారు. రెండు మండలాల్లో 8 గ్రామాలకు చెందిన సుమారు 2వేల మందికి పైగా ప్రజలు ఈ రిజర్వాయర్ వల్ల నష్టపోయారన్నారు. పొలం, ఇల్లు లేక అడుక్కుతినే పరిస్థితి వచ్చిందని, పగోడికి కూడా ఇలాంటి పరిస్థితి రాకూడదని అన్నారు. గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇద్దామని వచ్చామని, గవర్నర్ లేకపోవడంతో కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కాట్రావత్ స్వామి (ఫైల్)

కోడేరు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వాల్యానాయక్ తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన కాట్రావత్ స్వామి(28) భార్య నీలమ్మను 15 రోజుల కిందట గొడవపడటంతో గోపాల్‌పేట మండలం కేశంపేట తండాలో ఉన్న తల్లిగారి ఇంటికి వెళ్లింది. కాపురానికి రావాలని వెళ్లి అడిగినా రాకపోవడంతో మార్చి 27న కోళ్ల షెడ్డులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జడ్చర్లలో మరొకరు..

జడ్చర్ల: రోడ్డు దాటుతున్న ఇద్దరిని ఆదివారం ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టగా, ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి సోమవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని హోటల్‌లో పని చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన షేక్ అబ్దుల్ సలామ్(42), కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన మహ్మద్ ఫైజ్ అహ్మద్(62) జాతీయరహదారికి మరో వైపుగా ఉన్న మసీద్‌లో నమాజ్ చేసేందుకు వెళ్లారు. తిరిగి హోటల్‌కు వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో సలామ్ దుర్మరణం చెందగా, ఫైజ్ అహ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


కర్నూల్‌లో యువకుడు..

ఉండవెల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ పట్టణం వన్‌టౌన్‌కు చెందిన మహేష్(23) అతని స్నేహితులు శివ కుమార్, రాకేష్, రమేష్ రెండు స్కూటీలపై ఆదివారం అలంపూర్ చౌరస్తాలోని ఒక ధాబాలో భోజనం చేసి కర్నూల్‌కు బయలుదేరారు. జాతీయ రహదారిపై పుల్లూరు శివారులోని అలంపూర్‌చౌరస్తా సమీప మార్గంలోని ఉత్తర ఫీడ్స్ ఎదురుగా వాగు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో మహేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి స్నేహితులు ఆయనను కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు పేర్కొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

బాలానగర్: యువతిని వేధిస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జయప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణానికి చెందిన శివకుమార్ వేధిస్తున్నాడు. దీంతో సోమవారం యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 6 నెలలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో టీఏ సస్పెండ్


సల్కర్‌పేట్‌లో తిరుపతయ్య ఇంటికి అంటించిన ఉత్తర్వులు

గండేడ్: టీఎస్‌పీఎస్సీ ఏఈ ప్రశ్నాపత్రం లీకేజీలో బాధ్యుడిగా ఉన్న టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతయ్యను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని సల్కర్‌పేట్‌కు చెందిన తిరుపతయ్య 2007 నుంచి టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మొదట 5ఏళ్లు స్థానిక మండల పరిషత్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఆ తర్వాత వికారాబాద్ జిల్లా దోమ, కులకచర్ల మండలాల్లో విధుల్లో కొనసాగారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో పనిచేస్తూ 2020లో తిరిగి మండలంలో విధుల్లో చేరాడు. ఇటీవల టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీలో ఏఈ పేపర్ విక్రయంలో మధ్యవర్తిగా ఇతను వ్యవహరించినట్లు సిట్ అధికారులు గుర్తించి ఇతన్ని అరెస్టు చేశారు. దీంతో స్థానిక ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి మార్చి నెల 25న విధులకు గైర్హాజరయ్యాడని ఫోన్ కూడా పనిచేయలేదని, పేపర్ లీకేజీలో ఇతని ప్రమేయం ఉందని డీఆర్‌డీఓ యాదయ్యకు ఫిర్యాదు చేశారు. ఆయన కలెక్టర్‌కు నివేదించడంతో అతన్ని సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్‌డీఓ యాదయ్య ఈమేరకు గండేడ్ ఎంపీడీఓ కార్యాలయానికి మెయిల్ పంపారు. ఈమేరకు ఎంపీడీఓ పంచాయతీ సిబ్బందితో సస్పెండ్ ఉత్తర్వులు సల్కర్‌పేట్‌లోని తిరుపతయ్య ఇంటికి అతికించారు.

హత్యను.. ఆత్మహత్యగా చిత్రీకరించారు

- మందకృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అచ్చంపేట రూరల్: మన్ననూర్ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నిఖితను గత నెల 6న హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిని హత్య చేసిన నిందితులను అధికార పార్టీ నేతలు అండగా ఉంటూ, కేసును తప్పుదో పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకే పోలీసులు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని విమర్శించారు. మృతిపై సిట్టింగ్ జడ్జిలో విచారించి, నిందితులకు కఠిన శిక్ష వేయడంతో పాటు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా పట్టణంలో మరోమారు బందుకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, సతీష్ మాదిగ, సీపీఎం నాయకుడు దేశ్యానాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశీం, కాశన్న యాదవ్, అంతటి మల్లేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సతీష్

కోయిల్‌కొండ: మండలంలోని వింజామూర్‌లో గత నెల 28న రాత్రి అంబేద్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన విషయం తెలిసిందే. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన గడ్డంనాగరాజును సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సతీష్ సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహం గ్రామంలో పెట్టవద్దని విగ్రహ ఏర్పాటు సమయంలో తన అనుచరులతో కలిసి నాగరాజు అడ్డుకున్నాడని తెలిపారు. దీంతో సర్పంచ్ ఆ స్థలంలో స్వామి వివేకానంద, అంబేద్కర్ విగ్రహాలు పెట్టుకోవాలని పంచాయతీలో తీర్మానించినట్లు తెలిపారు. కొన్ని రోజుల క్రితం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మొగులయ్యకు, గద్దం నాగరాజుకు గొడవ అయ్యింది. ఈ విషయం మనుసులో పెట్టుకొని మార్చి 28న మధ్యరాత్రి నాగరాజు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అంబేద్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పటించి వెళ్లిపోయినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

మెడికల్ కళాశాలలో స్కిల్ ల్యాబ్ ఏర్పాటు


కృత్రిమ ప్రతిమలను పరిశీలిస్తున్న దృశ్యం

పాలమూరు: జాతీయ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు పాలమూరు మెడికల్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13లక్షల విలువ చేసే కృత్రిమ ప్రతిమలను విద్యార్థుల నైపుణ్య ప్రయోగశాల(స్టూడెంట్ స్కిల్ ల్యాబ్)కు అందజేశారు. పాలమూరు మెడికల్ కళాశాలలోని 21 విభాగాల్లో సర్జరీ, గైనిక్, పిడియాట్రిక్, అనస్థీషియా విభాగాల్లో స్టూడెంట్ స్కిల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలమూరు మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఒకేసారి రోగులపై కాకుండా కృత్రిమ ప్రతిమలపై అవసరమైన శిక్షణ పొందిన తర్వాత మనుషులపై అమలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇలా చేయడం వల్ల ఏదైనా తప్పులు జరిగితే ప్రొఫెసర్ల సమక్షంలో సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు వీటి ద్వారా నైపుణ్య అభివృద్ధి పెరుగుతుందన్నారు. ఈ ల్యాబ్‌లో త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాధ, వైద్యులు జీవన్, కిరణ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

నిజమే.. నిధులు మళ్లించాం!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన వ్యక్తిగత వైద్యుడే పరోక్షంగా సమ్మతించడంతో విచారణకు అంగీకరించక తప్పలేదు. చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్‌బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డ రామోజీరావును సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో సోమవారం దాదాపు 8 గంటలపాటు విచారించారు. విచారణ ప్రక్రియను పూర్తిగా ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా భారీగా నిధుల మళ్లింపు, రిజర్వ్ బ్యాంకు నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ డిపాజిట్ల సేకరణపై ఆధారాలతో విచారించారు. ఈ కేసులో ఏ–2గా ఉన్న రామోజీరావు కోడలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించనున్నారు. అనంతరం కేసు దర్యాప్తులో పురోగతిని సమీక్షించి రామోజీరావు, శైలజను ఆంధ్రప్రదేశ్‌కు పిలిచి మరోసారి విచారించాలని సీఐడీ భావిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

తప్పించుకునేందుకు చివరిదాకా యత్నం..

మార్గదర్శి అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు చివరి వరకూ ప్రయత్నించారు. రామోజీరావు, శైలజ హైదరాబాద్‌లోనే వారి నివాసంలోగానీ కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ సీఐడీ అధికారులు నోటీసులిచ్చారు. నాలుగు తేదీలు సూచించి వారికి అనువైన రోజు విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. నిబంధనల మేరకు కేసు దర్యాప్తులో భాగంగా విచారిస్తామని స్పష్టం చేశారు. అయితే విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు కాలయాపన చేశారు. చివరికి మార్చి 3న రామోజీ ఫిల్మ్‌సిటీలోని తన కార్యాలయంలో విచారణకు హాజరవుతానని సీఐడీకి తొలుత సమాచారం ఇచ్చారు. తీరా సోమవారం రోజు ఫిల్మ్‌సిటీలో కాకుండా జూబ్లీహిల్స్‌లోని తన కోడలు శైలజ కిరణ్ నివాసంలో విచారణకు హాజరవుతానని పేర్కొనగా అందుకు సీఐడీ అధికారులు సమ్మతించారు. ఈ మేరకు సీఐడీ ఎస్పీ అమిత్ బర్దార్, విచారణాధికారి రవికుమార్‌తోపాటు అధికారుల బృందం జూబ్లీహిల్స్‌లోని శైలజ నివాసానికి ఉదయం 10.30 గంటలకు చేరుకుంది. సీఐడీ అధికారులు రావడమే ఆలస్యం తన ఆరోగ్యం సరిగా లేనందున విచారణకు సహకరించలేనని రామోజీ పేర్కొన్నారు. అనారోగ్యానికి కారణాలు, నివేదికలు అందచేసి విచారణకు హాజరు కాలేరని ధృవీకరించాలని రామోజీరావు వ్యక్తిగత వైద్యుడిని సీఐడీ అధికారులు కోరారు. దీంతో రామోజీని విచారించవచ్చని, మంచంపై పడుకుని సమాధానాలు ఇస్తారని ఆయన వైద్యుడు చెప్పడంతో అందుకు సీఐడీ అధికారులు సమ్మతించారు. ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, కేసును సక్రమంగా విచారించడమే తమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఇక తప్పదని స్పష్టం కావడంతో సీఐడీ అధికారుల విచారణకు రామోజీ సమ్మతించారు.



ఆరోగ్యం బాగోలేదంటూ మంచంపైన రామోజీరావు.. కానీ, ఆరోగ్యం బాగానే ఉందన్న సొంత డాక్టర్.. ఈ సందర్భంగా వీడియో రికార్డింగ్‌తో విచారిస్తున్న సీఐడీ అధికారులు

ఆడియో... వీడియో రికార్డింగ్

విచారణ సందర్భంగా సీఐడీ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించారు. ఈ ప్రక్రియ మొత్తం రికార్డింగ్ చేశారు. రామోజీ పడుకున్న మంచం సమీపంలోనే వేర్వేరు కోణాల్లో రెండు కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయనకు కాస్త దూరంగానే సీఐడీ అధికారులు కూర్చున్నారు. విచారణ సందర్భంగా రామోజీరావు చెప్పిన సమాధానాలు, ఆయన హావభావాలు అన్నీ రికార్డ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సుదీర్ఘ విచారణ సందర్భంగా సీఐడీ అధికారుల బృందం అక్కడ కనీసం మంచినీళ్లు కూడా తాగలేదు. తమకు కావల్సిన ఆహారం, మంచినీళ్లు అంతా బయట నుంచే తెచ్చుకున్నారు.

నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లపై..

విచారణలో సీఐడీ అధికారులు కీలక విషయాలను రాబట్టినట్టు సమాచారం. ప్రధానంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు అక్రమంగా బదిలీ, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ, రికార్డుల నిర్వహణలో అవకతవకలపై ప్రశ్నించినట్లు సమాచారం. మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలు, బ్రహ్మయ్య అండ్ కో చార్టర్డ్ అకౌంటెంట్ శ్రావణ్ ఇచ్చిన వాంగ్మూలం కాపీలను చూపిస్తూ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసేందుకు రామోజీరావు ప్రయత్నించారు. కీలక పత్రాలు, బ్యాంకు లావాదేవీల కాపీలు, బ్యాలెన్స్ షీట్ల కాపీలను చూపిస్తూ అధికారులు ప్రశ్నించడంతో ఇక మాట్లాడలేకపోయారని తెలుస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లోని నిధులను ప్రధాన కార్యాలయానికి మళ్లించడం నిజమా.. కాదా? అని సూటిగా ప్రశ్నించడంతో అవునని రామోజీ అంగీకరించాల్సి వచ్చింది. చిట్‌ఫండ్స్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఇతర షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టిన ఆధారాలను కూడా సీఐడీ అధికారులు చూపించి ప్రశ్నించగా అదంతా మార్గదర్శి ఆర్థిక ప్రణాళికలో భాగమని రామోజీ చెప్పినట్టు సమాచారం. అంటే చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం వాస్తవమే కదా? అని ప్రశ్నించడంతో ఔనని రామోజీరావు అంగీకరించారని సమాచారం. చిట్టీల చందాదారులు పాడిన మొత్తాన్ని ఇవ్వకుండా రశీదు' మాత్రమే ఇస్తూ 5శాతం వడ్డీ చెల్లిస్తున్న విషయంపై కూడా సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించారు. తాము అట్టిపెట్టుకున్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తున్నాం కదా అందులో అక్రమం ఏముందనీ రామోజీరావు ఎదురు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని చెప్పి నగదును అట్టిపెట్టుకోవడం అంటే అది డిపాజిట్ సేకరణే అవుతుంది కదా... చిట్‌ఫండ్ కంపెనీలను డిపాజిట్ల సేకరణకు రిజర్వ్‌బ్యాంకు అనుమతించిందా? అంటే రామోజీరావు స్పందించకుండా మౌనం వహించారని సమాచారం. అంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ అధికారులు నమోదు చేసిన అభియోగాలన్నీ దాదాపు వాస్తవమేనని ఆయన పరోక్షంగా సమ్మతించినట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు, ఆడిటింగ్ వ్యవహారాలు చూసిన చార్టర్డ్ అకౌంటెంట్ కూడా నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్లకు పాల్పడినట్టు సమ్మతించారు.

స్టేట్‌మెంట్ విశ్లేషించాక తదుపరి చర్యలు: అమిత్ బర్దార్, ఎస్పీ

'మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాలకు సంబంధించి 7 కేసులు నమోదయ్యాయి. రామోజీరావును విచారించి ఆయన స్టేట్‌మెంట్ నమోదు చేశాం. అది విశ్లేషించాల్సి ఉంది. మార్గదర్శి ఎండీ శైలజను ఈ నెల 6న విచారిస్తాం. కేసులో కనుగొన్న ఆధారాలు, పురోగతిని బట్టి తదుపరి చర్యలు చేపడతాం'

సహకరించని రామోజీ

సీఐడీ అధికారులు విచారణ మొదలు పెట్టిన తరువాత రామోజీరావు సమాధానాలు చెప్పేందుకు చాలాసేపు ససేమిరా అన్నారు. సీఐడీ పరిధినే ప్రశ్నిస్తూ తనను అసలు విచారించడానికే వీల్లేదన్నట్టుగా వ్యవహరించడం గమనార్హం. తాను విచారణ సంస్థలకు అతీతమన్నట్టు మొండిగా వ్యవహరించారు. దీంతో చట్ట నిబంధనలను తెలియచేస్తూ సీఐడీ అధికారులు విచారణ ప్రక్రియ కొనసాగించారు. చిట్‌ఫండ్స్‌లో అక్రమ వ్యవహారాలన్నింటికీ తమ బ్రాంచి మేనేజర్లు(ఫోర్‌మెన్), అకౌంటెంట్లదే బాధ్యతని, తనకు సంబంధం లేదని తప్పించుకునేందుకు రామోజీరావు ప్రయత్నించారు. బ్రాంచి కార్యాలయాల్లోనే అన్ని వ్యవహారాలు సాగినందున వారినే ప్రశ్నించాలని మొండికేసినట్లు తెలుస్తోంది. బ్రాంచి మేనేజర్లకు రూ.500కు మించి చెక్‌పవర్ లేనప్పుడు భారీగా నిధుల బదిలీపై వారిని మాత్రమే ఎలా బాధ్యులను చేస్తామని సీఐడీ అధికారులు ఎదురు ప్రశ్నించడంతో రామోజీరావు మౌనం వహించారు. బ్రాంచిల నుంచి నిధులన్నీ హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలింపుపై కూడా తనకు సంబంధం లేదని రామోజీ వాదించారు. మరి చెక్ పవర్ మార్గదర్శి ఎండీ శైలజ, ప్రధాన కార్యాలయంలోని మరో 10 మంది వద్ద ఎందుకు ఉందని విచారణ అధికారులు ప్రశ్నించడంతో రామోజీ సమాధానం చెప్పలేకపోయారు. చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్‌మార్కెట్లో పెట్టుబడుల ద్వారా ఆర్జించిన ఆదాయం అంతా చైర్మన్, ఎండీలుగా వారే ప్రయోజనం పొందుతున్నప్పుడు కేవలం జీతాలకు పనిచేసే మేనేజర్లు ఎలా బాధ్యులవుతారని సీఐడీ అధికారులు ప్రశ్నించారు.

తదుపరి విచారణ ఏపీలో!

మార్గదర్శి వ్యవహారంలో ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ అధికారులు కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయనున్నారు. అందుకోసం రామోజీరావు, శైలజలను త్వరలో ఆంధ్రప్రదేశ్‌కు రప్పించి విచారించాలని భావిస్తున్నారు. నేరం జరిగిన ప్రదేశం(సీన్ ఆఫ్ అఫెన్స్) ఆంధ్రప్రదేశ్ కాగా మన రాష్ట్రంలోని చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు తీరును సమీక్షించిన అనంతరం తదుపరి విచారణ కోసం రామోజీరావు, శైలజలను రాష్ట్రానికి రప్పించాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో వారు ఎంపిక చేసుకున్న నగరంలో విచారించేందుకు సమాయత్తమవుతున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఆ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇతర రాష్ట్రాలకు ఇప్పటికే సీఐడీ అధికారులు సమాచారం ఇచ్చారు.

సన్నాలకు 'మద్దతు'కు మించి ధర

- క్వింటాలుకు రూ.2,330 నుంచి రూ.2,370 వరకు చెల్లింపులు
- పోటీ పడి కొంటున్న రైస్ మిల్లర్లు
- భారీ డిమాండ్‌తో రైతుల ఆనందం



మిర్యాలగూడలో రైస్‌మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్లు

మిర్యాలగూడ: ఈ సీజన్‌లో సన్న ధాన్యానికి భారీగా డిమాండ్ పెరగడంతో మిల్లర్లు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో యాసంగి సీజన్ సాగుకు సకాలంలో నీరు అందడంతోపాటు, దోమపోటు బెడద లేకపోవడంతో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చింది. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం వాహనాల రాకను అడ్డుకుంటే స్థానిక రైతులు పండించిన ధాన్యానికి మరింత ధర వచ్చే అవకాశం ఉంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో యాసంగి సీజన్‌లో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సారి సన్నరకాల్లో అంకూర పూజ, హెచ్‌ఎంటీ, కావేరి చింట్లు వంటి వాటిని సాగు చేసిన రైతులు నేరుగా రైస్ మిల్లులకు తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా వద్ద భారీ రైస్‌మిల్లు ఉంది. గంటకు 16 టన్నుల ధాన్యాన్ని మర ఆడించే సామర్థ్యం ఉండటంతో ఆ పరిసర ప్రాంతాల రైతులందరూ ఆ మిల్లుకే ధాన్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో మిర్యాలగూడ రైస్‌మిల్లర్లు కూడా ఎక్కువ ధర చెల్లించైనా కొనుగోలు చేయాలని పోటీపడుతున్నారు.

పక్క రాష్ట్రాల్లో డిమాండ్

సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి క్వింటాలుకు రూ.2,330 నుంచి రూ.2,370 వరకు చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2060, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 ఉంది. తెలంగాణ సన్నరకం ధాన్యానికి కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో అధిక డిమాండ్ ఉండడంతో మన రాష్ట్రం ధాన్యాన్ని అక్కడి వారు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెపుతున్నారు. ధాన్యానికి మంచి ధర వస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

సన్నాలకు మద్దతు ధర మించి చెల్లిస్తున్నారు



ఇటీవలే నేను ధాన్యాన్ని రైస్ మిల్లుకు తీసుకుపోయి అమ్మగా క్వింటాలుకు రూ.2,350 చొప్పున ధర చెల్లించారు. రెండు ఎకరాల్లో 70 బస్తాల ధాన్యాన్ని పండించాను. ప్రభుత్వ మద్దతు ధరకు మించి రేటు రావడంతో ఆనందంగా ఉంది.

– ఠాకూర్ బాలాజీసింగ్, రైతు, పెద్దదేవులపల్లి

నాణ్యమైన ధాన్యానికి గరిష్ట మద్దతు ధర



రైతులు మిల్లులకు తీసుకొచ్చిన నాణ్యమైన ధాన్యానికి గరిష్ట మద్దతు ధర లభిస్తుంది. రైస్ మిల్లులకు ఒకేసారి భారీ ఎత్తున ధాన్యంతో రాకుండా రైతులు విడతల వారీగా ధాన్యం తీసుకొస్తే ఇదే ధర కొనసాగించే అవకాశం ఉంది.

– కర్నాటి రమేశ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



చింతకాని: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన మరువక ముందే పదో తరగతి వార్షిక పరీక్ష పత్రాలు బయటకు వచ్చాయని.. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని మరువకముందే పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ కావడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ ఘటనల ద్వారా తెలుస్తోందని చెప్పారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువతతో పాటుగా పదో తరగతి విద్యార్థులకు సీఎం కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పడంతో పాటు రాజీనామా చేయాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. తన పార్టీ మార్పుపై అతిత్వరలోనే ప్రజా మోద నిర్ణయాన్ని తీసుకుంటానని తెలిపారు.

రమణీయం.. రథోత్సవం

- జనసంద్రమైన సిర్సనగండ్ల
- మార్మోగిన రామనామం



రథాన్ని లాగుతున్న భక్తులు



రథోత్సవానికి హాజరైన భక్తులు

చారకొండ: అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. వేకువజాము నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయం జనసంద్రంగా మారింది. ఈ ఘట్టం మూడు గంటల పాటు కోలాహలంగా సాగింది. కళాకారులు రథం ఎదుట కోలాటాలు, నాటకాలు, ఆటాపాటలతో అలరించారు.

– రథోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి వివిధ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కడే జాగారణ చేసి ఉదయం రథోత్సవంలో పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామున రథాన్ని పూలతో అలంకరించగా అలయ చైర్మన్ రామశర్మ రథాన్ని లాగి ప్రారంభించారు.

– బ్రహ్మోత్సవాల్లో వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ గిరిబాబు, సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవం లాగే సమయంలో వాహనాలు గుట్టపైకి రాకుండా నిలిపివేశారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రశాంత వాతావరణంలో రథోత్సవం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు.

రామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం హుండీని లెక్కించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మార్చి 1న, తాజాగా బ్రహ్మోత్సవాలు, జాతర ముగియడంతో నెల రోజుల వ్యవధిలో మరోసారి లెక్కింపు చేపట్టారు. ఈసారి భక్తుల నుంచి రూ.4,26,280 ఆదాయం స్వామి వారికి సమకూరింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఈఓ రాజేశ్వరశర్మ, చైర్మన్ రమేష్‌గౌడ్ పర్యవేక్షించారు.

రామన్‌పాడుకు నీరు నిలిపివేత

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,018 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి సాగునీరు అందిస్తున్న ఎన్టీఆర్ కాల్వకు నీటి సరఫరా నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

నేటినుంచి పబ్బతి ఆంజనేయస్వామి ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం

మన్ననూర్: రాష్ట్రంలోని పవిత్ర పుణ్యక్షేత్రాల్లో మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం ఒకటి. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలోని మన్ననూర్ గ్రామానికి 52 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం కొలువై ఉంది. ఏట నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహనం, పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నారు. 5వ తేదీ బుధవారం సీతారాముల కల్యాణం, 6వ తేదీ గురువారం హనుమాన్ జయంతి మహా కుంభాభిషేకం, హనుమాన్ గాయత్రి హోమం, పూర్ణాహుతి, హనుమాన్ దీక్ష చేపట్టిన భక్తుల మాల విరమణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ విష్ణుమూర్తి, ఈఓ రంగాచారి, ప్రధాన అర్చకుడు వీరయ్యశర్మ, తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం ప్రాంగణంలో అన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

లడ్డూ తయారీ పరిశీలన



లడ్డూ ప్రసాదాలు తనిఖీ చేస్తున్న ఈఓ పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ ఆలయానికి వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదాల రుచులు నోరూరిస్తున్నాయి. మూడు రోజుల నుంచి నేతితో లడ్డూ ప్రసాదాల తయారీ ప్రారంభం కావడంతో భక్తులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. గతంలో లడ్డూ, వడ రూ.10 ఉండగా, ప్రస్తుతం వీటి ధరను రూ.20కి పెంచారు. ఈఓ పురేందర్‌కుమార్ సోమవారం లడ్డూ, వడ తయారీని పరిశీలించారు. అనంతరం కౌంటర్ దగ్గర భక్తులు ప్రసాదాల కొనుగోలు చేస్తుండగా, వారితో మాట్లాడి ప్రసాదాల రుచి, శుచి గురించి అడిగి తెలుసుకున్నారు. పెరిగిన ధరల గురించి భక్తులకు వివరించారు.

కుట్టుమిషన్ శిక్షణతో 'ఉపాధి'

- పదేళ్లుగా గోపాల్‌పేటలో నిర్వహణ
- స్వామి రామానంద తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో వందల మందికి శిక్షణ



కుట్టు మిషన్ నేర్చుకుంటున్న మహిళలు

గోపాల్‌పేట: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలు, యువతులకు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ ఇస్తుంది. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలో 2009 నవంబర్‌లో అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ద్వారా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించి వారికి ధ్రువపత్రాలు ఇస్తారు. 12ఏళ్ల నుంచి 45 బ్యాచ్‌ల మహిళలకు శిక్షణ పూర్తవడంతో, కుట్టుమిషన్ కేంద్రం ఏర్పాటు చేసుకోవడంతో పాటు వారు ఇతరులకు నేర్పుతున్నారు.

వెయ్యి మందికి పైగా శిక్షణ

ప్రతి బ్యాంచ్‌కు 20 నుండి 30 మందితో కలిపి ఇప్పటికే వెయ్యి మందికి పైగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించారు. కొత్తగా చేరేవారికి మొదట న్యూస్ పేపర్‌పై డిజైన్ కటింగ్ నేర్పిస్తారు. ఆ తర్వాత కుట్లు ఎలా వేయాలి, తర్వాత సొంతంగా తెచ్చుకున్న చిన్న గుడ్డలను కత్తిరించడం, అనార్కలి డ్రెస్, అంబ్రిల్లా ఫ్రాక్, పంజాబీ డ్రస్సులు వంటివి కుట్టడం నేర్పుతారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 46వ బ్యాచ్ ప్రారంభమైంది. వేసవిలో కొత్త వారు నేర్చుకునేందుకు అవకాశం ఉందని ఈ అవకాశాన్ని మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు చెబుతున్నారు.

తాగునీరు, మూత్రశాలలు లేక ఇబ్బందులు

కుట్టుమిషన్ నేర్చుకునేందుకు వచ్చిన వారికి తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నేర్చుకునేందుకు వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, మూత్రశాలలు ఏర్పాటు చేయిస్తే బాగుంటుందని వారు కోరుతున్నారు.

స్వయం ఉపాధి పొందుతున్నా



ఐదేళ్ల క్రితం గోపాల్‌పేటలోని శిక్షణ పొందాను. అప్పటి నుంచి నేను సొంతంగా కిరాణం షాపు పెట్టుకోవడంతో పాటు కుట్టుమిషన్ కుట్టి స్వయం ఉపాధి పొందుతున్నాను. శిక్షణ ఇవ్వడం బాగుంది. అక్కడ సౌకర్యాలు మెరుగు పరిస్తే చూస్తే బాగుంటుంది.

– శ్రీలత, తాడిపర్తి

ఉపాధి చూపడమే లక్ష్యం



స్వామి రామానంద తీర్థ ట్రస్ట్ ద్వారా మేము శిక్షణ ఇచ్చి మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే వారు సొంతంగా ఉపాధి పొందుతున్నారు. సంస్థ తరుపు నుంచి మేము కృషి చేస్తున్నాం. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సహాయ సహకారాలు అందించాలి.

– రామేశ్వరమ్మ, శిక్షకురాలు

జిల్లా కళాకారుడికి జాతీయస్థాయి అవార్డు



శివయ్యను సత్కరిస్తున్న తమణారెడ్డి, మోషే దయాన్

కందనూలు: ప్రముఖ చిత్రకారుడు బ్రహ్మ ఏలూరి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో జిల్లాలోని ఉప్పునుంతల మండలం కాంసానిపల్లికి చెందిన కళాకారుడు చీర్లమల్ల శివయ్యకు జాతీయస్థాయి మోస్ట్ ప్రామిసింగ్ అవార్డు వరించింది. ప్రముఖ చరిత్రకారులు తమణారెడ్డి, మోషే దయాన్ చేత అవార్డు, జ్ఞాపికను అందుకున్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఎస్‌ఐ రమేష్, సిబ్బంది

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాలలో చోరీలకు గురైన సెల్‌ఫోన్లను పోలీసులు బాధితులకు సోమవారం తిరిగి అప్పగించారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని పలు ప్రాంతాలలో సెల్‌ఫోన్లు చోరీ విషయమై పలు ఫిర్యాదులు వచ్చాయి. రికవరీ చేసిన సెల్‌ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించామని, వాటి విలువ సుమారుగా రూ.80వేల వరకు ఉంటుందని ఎస్‌ఐ తెలియజేశారు. రికవరీ చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్‌ఐ అభినందించారు.